
నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, మంగళవారం 11 జూన్ 2024 | SIDDIPET

# గృహజ్యోతి అందక అర్హుల అవస్థలు


గృహజ్యోతి పథకం అందక అవస్థలు పడుతున్న బాధితులు

బెజ్జంకి, జూన్ 10: ప్రభుత్వ పథకాలు అర్హులకు అందని ద్రాక్షలా మారాయి. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన అర్హత గల కుటుంబాలు గృహజ్యోతి పథకం అందక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం సేకరించిన దరఖాస్తుల స్వీకరణలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా సున్నా బిల్లు వస్తుందని ఆశగా నెలల తరబడి ఎదురుచూశారు. కానీ కరెంట్ బిల్లు యధావిధిగా రావడంతో వారు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సంప్రదించారు. మీరు గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోలేదని, ప్రభుత్వం సవరణ అవకాశం కల్పించినప్పుడు సమాచారం ఇస్తామని చెప్పడంతో వారు అవాక్కయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గృహజ్యోతి పథకంలో అవకాశం కల్పించాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.



అర్హులకు ఇచ్చిన ప్రజాపాలన రసీదు



గృహజ్యోతి వర్తించదంటూ జారీ చేసిన కరెంటు బిల్లు

# అన్నదాత సుఖీభవ

- హిమగిరుల్లో సిద్దిపేట రుచులతో భోజనం
- తెలుగువారి మొదటి అన్నదాన శిబిరం
- భక్తుల సౌకర్యార్థం నాలుగోసారి లంగర్ ఏర్పాటు
- దాదాపు 200 మందికి ప్రతిరోజూ అన్నదానం

## కేదార్‌నాథ్‌లో భక్తుల కడుపునింపుతున్న సిద్దిపేట అన్నదాన సేవాసమితి



కేదార్‌నాథ్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానం శిబిరంలో భక్తులకు అన్నదానం చేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, జూన్ 10: అన్నం పరబ్రహ్మ స్వరూపం అనే అక్షర సత్యాన్ని సిద్దిపేట కేదార్‌నాథ్ అన్నదాన సేవాసమితి నిజం చేసింది. అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అనే నానుడిని అచరణలో చేసి చూపుతున్నది. అక్కడ ఇక్కడ కాదు..చార్‌దామ్ యాత్రలో ముఖ్యమైన.. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ప్రధానమైన కేదారేశ్వరుడి సన్నిధిలో అన్నదానం చేయాలని సంకల్పించి సాహసోపేతమైన ఘట్టానికి 2019లో బీజం వేసింది. అప్పటి నుంచి హిమగిరుల్లోని పరమశివుడిని దర్శించుకునే భక్తులకు అన్నదానం చేస్తున్నది. ఈ పరంపరను నాలుగోసారి కొనసాగిస్తున్నది. ఈ నేపథ్యంలో యాత్రికులకు సిద్దిపేట సేవా సమితి అందిస్తున్న సేవలపై ప్రత్యేక కథనం..

### తెలుగువారి అన్నదానం శిబిరం

సిద్దిపేటకు చెందిన కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులు 2019లో 30 మందితో సేవాసమితిని ప్రారంభించారు. కేదార్‌నాథ్‌లో అన్నదానం చేయాలని బలంగా అనుకున్నారు. మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సేవాసమితిలో గౌరవ సభ్యులుగా ఉన్నారు. దీంతో ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ స్వామి చెంత దక్షిణ భారతదేశంలోనే మొదటి తెలుగు వారి అన్నదాన శిబిరం (లంగర్) ఏర్పాటైంది.

### మందాకి నది వంతెన..

ఉత్తరాఖండ్‌లో వెలిసిన కేదారేశ్వరుడి ఆలయానికి 21 కి.మీ దూరంలోని సోన్‌ప్రయాగ్ మందాకిని నది వంతెన దాటగానే సిద్దిపేట కేదార్‌నాథ్ అన్నదాన సేవాసమితి వారు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఏడాది నూతంగా కేదార్‌నాథ్ ఆలయనికి దగ్గరగా మరో అన్నదాన కేంద్రాన్ని భక్తుల కోరిక మేరకు ప్రారంభించారు. 100 మంది సేవా సమితి సభ్యులు విడుతల వారీగా పరమశివుడి దర్శనానికి వచ్చే భక్తులకు సేవ చేస్తూ ఆ దేవదేవుడి అనుగ్రహం పొందుతున్నారు.

### సాహస యాత్రలో పంచభక్ష పరమన్నాలు

మంచుకొండలో వెలిసిన దేవదేవుడి


కేదార్‌నాథ్ ఆలయం

దర్శనం అంటే మామూలు విషయం కాదు. చుట్టూ మంచు కొండలు.. లోయలు మైనస్ డిగ్రీ ఉష్ణోగ్రతలు..భిన్న వాతావరణ పరిస్థితులు. అలాంటి చోట సిద్దిపేట కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి భక్తులుకు పంచభక్ష పరమన్నాలు వడిస్తూ శివ భక్తుల మన్ననలు పొందుతున్నది. తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు శిబిరం నిర్వీరామంగా కొనసాగుతున్నది. భక్తులకు దక్షిణాది భోజనంతో పాటు రుచికరమైన అన్ని రకాల తెలుగు వంటకాలను అందిస్తూ కండునింపుతున్నది. అన్నం, పులిహోర, పెరుగన్నం, అల్పాహారాలు, మిఠాయిలు, పానీపూరి వరకు అన్ని రుచికరమైన వంటలను సమకూర్చుతున్నారు. భక్తుల సహాయార్థం సమాచార సెంటర్‌ను ప్రత్యేకంగా ప్రారంభించి సాయం చేస్తున్నారు. లంగర్‌లో సుమారు రెండు వందల మందికి రాత్రి సమయంల్లో వసతి కల్పించి సిద్దిపేట ఖ్యాతిని గర్వంగా చాటుతున్నారు.

### దైవ సంకల్పం..



కేదార్‌నాథ్ స్వామి చెంత అన్నదానం చేయడం దైవసంకల్పం.. మానవ సేవ మాధవ సేవగా భావించి గొప్ప దైవ కార్యానికి శ్రీకారం చుట్టాం. మంచు కొండల్లో వెలిసిన దేవదేవుడి సేవ అదృష్టం అందరికీ రాదు. నాలుగోసారి అన్నదానం చేయడం సంతోషంగా ఉంది. ఈ ఏడాది భక్తుల సౌకర్యార్థం మరో అన్నదానం శిబిరాన్ని ఏర్పాటు చేశాం. మంచుకొండల్లో అన్నదానం స్వామి అనుగ్రహంతో నిర్వీరామంగా కొనసాగుతున్నది.
– చీకోటి మధుసూదన్, కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు

### స్వామివారి సన్నిధిలో సేవ చేయడం అదృష్టం



కేదారేశ్వరుడి చెంత అన్నదానం చేయడం మధురానుభూతి..ఇంత గొప్ప సత్ కార్యం జీవితంలో మరోటి లేదు. దేశంలో అద్భుత క్షేత్రం..కేదార్‌నాథ్.. అంతంటి మహిమాన్విత ఆలయ దర్శనానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదం అందించడం అదృష్టం. అందరి సహకారంతో మంచుకొండల్లో అన్నదానం చేస్తున్నాం. – అయిత రత్నాకర్, సమితి సెక్రటరీ



దుబ్బాక వంద పడకల దవాఖానలో నూతనంగా నియమితులైన స్టాఫ్ నర్సులతో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# మెరుగైన వైద్యసేవలు అందించాలి

## కేసీఆర్ ప్రత్యేక చొరవతోనే దుబ్బాకలో వంద పడకల దవాఖాన

- పీహెచ్‌సీల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి
- నూతనంగా నియమితులైన స్టాఫ్‌నర్సులకు బ్యాడ్జిలు అందజేత

దుబ్బాక, జూన్ 10: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుబ్బాకలో వంద పడకల దవాఖాన భవన సముదాయాన్ని నిర్మించుకున్నామని, ఇక్కడ మూడు జిల్లాల ప్రజలకు వైద్య సేవలు అందటం చాలా సంతోషకరమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించి దుబ్బాకకు మంచిపేరు తీసుకురావాలని వైద్యులు, సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. సోమవారం దుబ్బాక వంద పడకల దవాఖానలో నూతనంగా నియమితులైన స్టాఫ్‌నర్సులకు బ్యాడ్జిలను ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి అందజేశారు. అనంతరం దుబ్బాక వంద పడకల దవాఖానలో వైద్యసేవలపై, నియోజకవర్గంలోని పీహెచ్‌సీలకు సంబంధించిన వైద్య సిబ్బందితో వేర్వేరుగా సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి పుట్ట శ్రీనివాస్, డీసీహెచ్‌ఎస్ సాయికిరణ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కాశీనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

### సర్కారు దవాఖానలకు గుర్తింపు తీసుకురావాలి

ప్రభుత్వ దవాఖానల్లో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించి, వైద్య వృత్తికి మరింత వన్నే తీసుకురావాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట–భూంపల్లి, తొగుట, దౌల్తాబాద్, రాయపోల్, చేగుంట, నార్సింగ్ మండలాల్లోని 10 పీహెచ్‌సీల వైద్య సిబ్బందితో సమీక్షలో పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన వివరాలతో పాటు ప్రజలకు అందిస్తున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. పలు పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించడం లేదని ఎమ్మెల్యే ఆసంతృప్తి వ్యక్తం చేశారు. షుగరు, బీపీ రోగులకు మందులు ఇవ్వకుండా వాటిని వృథాగా పారేస్తున్నారని, పీహెచ్‌సీకి రోగులు రాకున్నప్పటికీ రికార్డుల్లో మాత్రం అత్యధికంగా ఓపీ, ఐపీ రోగులు వస్తున్నట్లు రాస్తున్నట్లు పలు ఆరోపణలున్నాయని తెలిపారు. పీహెచ్‌సీల్లో రాత్రివేళల్లో వైద్యులు ఉండటం లేదన్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీంతో ప్రైవేటు దవాఖానలను ఆశ్రయిస్తున్నట్లు పలు విమర్శలు వస్తున్నాయని తెలిపారు. ఇకముందు అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. అంకితభావంతో పనిచేసి, ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. పేదల వైద్యానికి ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ పలుచోట్ల వైద్య సిబ్బంది తమ విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించటం బాధాకరమన్నారు. వారి పనితీరును మార్చుకుని ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని సూచించారు. నియోజకవర్గంలో అత్యధికంగా గ్రామీణ పేదలే ఉన్నారని, పూర్తిస్థాయిలో ప్రభుత్వ వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

### ప్రతినెలా సమీక్షా సమావేశం

దుబ్బాక నియోజకవర్గంలోని పీహెచ్‌సీల్లో ప్రతినెలా సమీక్షా సమావేశం నిర్వహించాలని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారిగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో సైతం సమీక్ష నిర్వహిస్తామన్నారు. పీహెచ్‌సీల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన దుబ్బాక వంద పడకల దవాఖానలో మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గం అభివృద్ధితో పాటు ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వంద పడకల దవాఖాన సూపరింటెండెంట్ హేమరాజ్, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు దేవుని లలిత, ఆస యాదగిరి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి

- రెవెన్యూ, రైల్వేశాఖ అధికారుల సమావేశంలో సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి


ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి


సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 10: రైల్వేలైన్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ, రైల్వేశాఖ అధికారులతో మనోహరాబాద్– కొత్తపల్లి రైల్వే నిర్మాణంలో భాగంగా చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నకోడూరు మండలంలోని పెద్దకోడూరు, చిన్నకోడూరు, మాచాపూర్, గంగాపూర్, వితలాపూర్ గ్రామాలు, నారాయణరావుపేట మండలంలోని గుర్రాలగొంది, జక్కాపూర్ గ్రామాల్లో మొత్తం 25 ఎకరాల 30 గుంటల భూమిని ఇంకా రైల్వే నిర్మాణానికి సేకరించాల్సి ఉన్నందున ఆయా మండలాల తహసీల్దార్లు, సిద్దిపేట ఆర్డీవో ప్రత్యేక శ్రద్ధ చూపి త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట ఆర్డీవో సదానందం, రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ జనార్దన్, సిద్దిపేట అర్బన్, నారాయణరావుపేట, చిన్నకోడూరు తాసీల్దార్లు పాల్గొన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి వస్తారని, అధికారులు శాఖలవారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 14 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో నాగ రాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, తదితర అధికారులు పాల్గొన్నారు.

# సర్కారు బడులకు వెలుగులు

- కార్పొరేట్ సంస్థల సహకారంతో మౌలిక వసతుల కల్పన
- బీఆర్‌ఎస్ హయాంలో విద్యకు ప్రాధాన్యత
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


ముత్తంగిలో పాఠశాల నూతన భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జూన్ 10: సీఎస్సార్ నిధులతో సర్కారు బడులకు కొత్త వెలుగులు వస్తున్నాయని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం ముత్తంగి డీఎన్ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో నిర్మిస్తున్నారు. నూతన భవన నిర్మాణ పనులకు ఎంపీపీ సుష్మాశ్రీతో కలసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరులో కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. 2014 నుంచి 2024 వరకు పటాన్‌చెరును ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేశామన్నారు. బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో కేసీఆర్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. 1100లకు పైగా గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను ఉచితంగా అందజేశామన్నారు. కార్పొరేట్ సంస్థల సహకారంతో పటాన్‌చెరు నియోజకవర్గంలో అనేక పాఠశాలల్లో సొంత భవనాలు నిర్మించి ఇచ్చామన్నారు. జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలను సైతం సీఎస్సార్ నిధులతో ఏర్పాటు చేసుకున్నామన్నారు. గ్లాండ్ ఫార్మ కంపెనీ ముత్తంగి ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి ఆర్థిక సహకారం అందజేయడాన్ని కొనియాడారు. దాతల సహకారంతో పాఠశాలలకు వసతులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గడీల శ్రీకాంత్ గౌడ్, గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సీఎస్ఆర్ హెడ్ రఘురామన్, జడ్పీటీసీ సుప్రజా వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ స్వప్నాశ్రీనివాస్, ఎంపీటీసీ గడీల కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఉపేందర్ ముదిరాజ్, రామకృష్ణ ముదిరాజ్, ఎస్ శ్రీనివాస్, తులసిగౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సరఫరా మెరుగుపర్చాలి

- బడిబాటను సమర్థవంతంగా నిర్వహించాలి
- మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాగౌడ్


మనోహరాబాద్‌లో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాగౌడ్

మనోహరాబాద్, జూన్ 10: మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని రామాయిపల్లిలో బడిబాట కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం జడ్పీ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న గౌడ కమ్యూనిటీ భవనం, రేణుకా ఎల్లమ్మ దేవాలయ నిర్మాణ పనులు, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లకు మెరుగైన తాగునీటి సరఫరాతో పాటు పలు అంశాలపై అధికారులతో చర్చించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మిషన్ భగీరథ నీరు సరిపడా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏఈ మధు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు రతన్‌లాల్, గౌడ సంఘం నాయకుడు పాండుగౌడ్ పాల్గొన్నారు.

# జేఈఈలో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

## 92 మార్కులతో ఎస్టీ కమ్యూనిటీలో 391వ ర్యాంకు


మారుతి కుమార్

నర్సాపూర్, జూన్ 10: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో నర్సాపూర్‌లోని గిరిజన గురుకుల కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భిక్షమయ్య మాట్లాడుతూ కళాశాలకు చెందిన మారుతీకుమార్ 92 మార్కులతో ఎస్టీ కమ్యూనిటీలో 391 ర్యాంక్ సాధించాడని తెలిపారు. మొత్తం 17 మంది విద్యార్థుల్లో నలుగురు ఐఐటీ ర్యాంకులు, ఐదుగురు ప్రిపరేటరీ ర్యాంకులు సాధించి, ఐఐటీ సీట్లు పొందనున్నారని తెలిపారు. మిగిలిన విద్యార్థులు రెండు నీట్, మూడు ఐఐఐటి సీట్లు పొందే అవకాశం ఉన్నదని వెల్లడించారు. విజయం సాధించిన విద్యార్థులను ఆర్సీ సంపత్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కల్యాణి, సీనియర్ అధ్యాపకులు అభినందించారు.

# ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

## ఒకరి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు


కరెంటోతు కవిత(ఫైల్)


అక్కన్నపేటలో ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

హుస్నాబాద్ రూరల్, జూన్ 10: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో మహిళ మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ బస్సు హుస్నాబాద్ నుంచి జనగామ వైపు వెళ్తుండగా బైక్ పంతులుతండా చౌరస్తాలో ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొన్నది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న కరెంటోతు కవిత (32) అక్కడికక్కడే మృతిచెందగా, కరంటోతు రాజు, కరంటోతు స్వప్నలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న బంధువులు, గ్రామస్తులు మృతిచెందిన మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. పోలీసులు సర్దిచెప్పిన అనంతరం హుస్నాబాద్ దవాఖానకు కవిత మృతదేహాన్ని తరలించారు. మృతురాలికి భర్త, కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కాలుష్య వ్యర్థాలతో సాగుకు ఆటంకం

- ప్రజావాణిలో వడ్డేపల్లివాసులు ఆవేదన
- అర్జీలు స్వీకరించిన సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


సంగారెడ్డిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 10: సురభి ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ రసాయ పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలకు పంటలు సాగు చేసుకోలేక పోతున్నామని హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామస్తులు, రైతులు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫిర్యాధు చేశారు. కంపెనీపై చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు ఫిర్యాధులు అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజావాణిలో మొత్తం 48 అర్జీలు అందాయి. దరఖాస్తులను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి స్వీకరించిన కలెక్టర్ వాటిని సకాలంలో పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. బుధవారం బడులు ప్రారంభమవుతాయని గుర్తు చేశారు. తొలిరోజు నుంచే విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు అందించాలన్నారు. ప్రతి గ్రామంలో పాఠశాల ప్రారంభం రోజు ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాలల సభ్యులు, ఉపాధ్యాయులు, పాఠశాలల్లో చేరే విద్యార్థులకు వినూత్నంగా స్వాగతం పలకాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసిందని, అందుకనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించినట్టు తెలిపారు. అధికారిక కార్యక్రమాలు, సమావేశాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధ ఆజ్ఞలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్వో పద్మజా రాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.